# దాగుడు మూతలు

ఈజీ ఛైర్‌లో కూచుని ఆలోచిస్తున్నాను. ఇప్పుడు గుర్తులేని ఏదో విషయంగురించి. టెలిఫోను మోగిందింతలో. లేచి వెళ్ళి రిసీవర్ అందుకున్నాను. "హల్లో" అన్నాను. అవతలనుంచి ఎవరో అడుగుతున్నారు "మాట్లాడేది ఎవర"ని.

"నేను వేణుగోపాలాన్ని. డాక్టర్ వేణుగోపాల్" అని జవాబు చెప్పాను.

"నువ్వేనా? వేణూ! నేను రా? రాఘవయ్యని. ఉడిపినుంచి మాట్లాడుతున్నాను." అని వినిపించింది అవతలినుంచి.

ఎవరూ? రాఘవయ్యా? అంటే!

నేను స్కూల్లో చదువుకునే రోజుల్లో రాఘవరావు అని ఒకడుండేవాడు—కాలేజిలో చేరింతర్వాత మా యిద్దరికీ స్నేహం తగ్గిపోయింది. ఆ తర్వాత అప్పుడప్పుడూ కనిపించేవాడు—రెండేళ్ళనుంచీ అదికూడా లేదు. ఇంటర్ చదువుతున్నప్పుడు రాఘవాచారి సన్నిహితుడయ్యాడు. అయితే, నేను మెడికల్ కాలేజిలో చేరింతర్వాత అతనితో కూడా విడిపోవల్సి వచ్చింది. మూడేళ్ళబట్టీ అతని పోకడకూడా అంతులేదు.

రాఘవ అన్నపేరుమీద ఆరావు. ఈఆచారితప్ప యిక ఏఅంతం
గల స్నేహితులూ లేరు —అయితే యీ "అయ్య" ఎవడు?
ఏమయితే అయింది బాగుండదని "ఓ నువ్వా రాఘవయ్యా!
ఎప్పుడూ రావటం? మా యింటికి రాకుండా అక్కడెందుకు
దిగావు" అన్నాను. బహుశా తెలిసినవాడై వుంటాడు? ఇంటికి
వస్తే ముఖం చూస్తున్నా గుర్తు పట్టవచ్చనే ఊహతో.

"అహఁ. స్నేహితుడితో వచ్చానులే, చాలా పనివుంది. నీతో
కూడా ముఖ్యంగా మాట్లాడవలసింది చాలావుంది. సాయంత్రం
ఆరువరకూ నాకు తీరుబడి వుండదు! ఎప్పుడు రమ్మంటావు?"
అన్నాడవతలి నుంచి ఎవరో తెలియని రాఘవయ్య.

"అయితే సాయంత్రం ఆరింటికల్లా వుంటాను యింటిదగ్గర.
రా" అన్నాను.

"సరే అయితే అడగటం మరచిపోయాను. కులాసాగా ఉంటు
న్నావా?"

"ఆఁ చాలా"

"అవున్లే. అందులో డాక్టరివి. మరి సాయంత్రం కలుసుకుం
టాను. ఉంటా."

"అలాగే"

నేను రిసీవరు పెట్టేసి వచ్చి యీజీచైర్‌లోవాలాను. ఎవరీ రాఘ
వయ్య? ఎవరయి ఉంటాడు?

రాఘవరావయితే నన్ను "ఏరా"అనే పిలుస్తాడు. రాఘవాచారితో
నా స్నేహం "అండీ"తోనే ఆగిపోయింది. వచ్చింది రాఘవరావు
అయివుంటాడా? అయితే, యీ అయ్య ఎప్పుడు తగిలించు
కున్నాడు?

ఒకవేళ రాఘవాఛారి కాకూడదా అనుకున్నాను. అప్పుడు ఏమని
సంభోదించేవాడో మరచిపోయి యిప్పుడు ఈఏకవచన ప్రయో
గాన్ని అతి స్వేచ్ఛగా ఉపయోగించి వుండవచ్చు.

ఏమయినా యీ యిద్దరిలోనే ఎవరో ఒకరయి వుండాలి. అంత వరకూ ఖాయం. సాయంత్రానికల్లా ఏ విషయమూ తేలిపోతుందిగా అని ఆఖరిసారిగా అనుకుని అప్పుడే వచ్చిన న్యూస్ పేపరు తెరిచాను.

సాయంత్రం ఆరింటికి యింటిదగ్గర ఖచ్చితంగా ఉండదల్చుకున్నాను. డిస్పెన్సరీ వర్కు అయిదున్నరకల్లా ముగించుకుని ఆరింటికల్లా యింటిదగ్గర కాచుకుని కూచున్నాను.

ఆరయిపోయింది. నాకు ఆదుర్దా ఎక్కువయి పోతూంది— రాఘవయ్యని చూసేంటందుకు. ఇంకో పావుగంటకూడా గడిచిపోయింది. రాడేం? ఓపికతో మరో అరగంట చూశాను. ఈలోగా నేను ఎన్ని అవస్థలు అనుభవించాలో అన్ని అవస్థలూ అనుభవించాను. ఇంతకీ ఆరాఘవయ్య అనేవాడు నేననుకున్న యిద్దరిలో ఒకడయి ఉంటాడా? లేక వేరే ఎవరైనా నూతనంగా ఊడిపడతాడా అని నా అనుమానం.

కాని, ఎంతసేపటికీ అతను ఊడిపడలేదు. నాకు యిక విసుగు పుట్టింది. ఎవరో యీ అజ్ఞాతపు రాఘవయ్య! తనకోసం నన్నెదురుచూడమని చెప్పి యిబ్బంది పెట్టటమేమిటి? అతనికోసం నేను యిలా యెదురుతెన్నులు చూస్తూ కూచోవటం ఏమిటి? ఇక ఉండలేక లేచాను. టెలిఫోను మోగింది. పోయి రిసీవరు చేతిలోకి తీసుకున్నాను.

"హలోవ్"

అవతలినుంచి రాఘవయ్యే మాట్లాడుతున్నాడు, "నేను రాఘవయ్యని. అనుకోకుండా అవాంతరం ఒకటి వచ్చిపడినందువల్ల రాలేకపోయాను. వెరీసారీ....ఎప్పుడు వస్తానంటున్నావా? రేపు పొద్దుట ఫ్యూర్. ఎయిట్ అయేసరికి ఠంచన్‌గా వచ్చేస్తాను.... తప్పకుండా వుంటావుగా?....నాకోసం యిందాకటినుంచి ఎదురు చూస్తున్నావా? అయ్యో పాపం....సరే అయితే ఉంటా"

ఫోనువదలి వచ్చేశాను. ఈ కాస్త వార్తకోసం గంటసేపు నన్ను సందిగ్ధంలోపడేసి వుంచాడు-ఈరాఘవయ్య మంచివాడే. వాడే రాఘవరావు అయివుంటే రేపు ఇంటికి వచ్చింతర్వాత నాలుగు చీవాట్లు పెడతాను. "వస్తాను ఎదురు చూడ"మని చెప్పినవాడికోసం ఎదురు చూడటంలో ఉన్న బాధ విషయం ఆ ఎదురు చూసేవాడికి ఒక్కడికే తెలుస్తుంది.

ఆ సాయంత్రం వృథా అయిపోయింది. మరునాటి ఉదయం కోసం ఆదుర్దాతో ఎదురు చూశాను.

మరునాటి ఉదయం వచ్చింది. ఏడున్నరకూడా అవనేఅయింది. అప్పటికే కాలకృత్యాలన్నీ తీర్చుకుని డ్రాయింగ్ రూమ్‌లో కూచుని ఎదురు చూడసాగాను — రాఘవయ్యకోసం.

ఇంకో అరగంట. అరగంటలో రాఘవయ్య అన్నవాడు ఎలానూ వస్తాడు. ముఖాముఖీగా చూస్తాను. చిన్నప్పటి రాఘవరావో, మధ్యలో వచ్చిన రాఘవాచారో. మూడోవాడైనా వూడిపడతాడో తేల్చుకుంటాను.

"బాబుగారో!"

చూశాను. వీరిగాడు.

"మీకోసం ఎవరో వచ్చారు బాబూ!"

"ఎవరు? రాఘవయ్యేనా" అన్నాను ఉత్సాహంతో.

"కాదండి. రంగయ్యగారుట. వాళ్ళమ్మాయికి జబ్బుగా ఉంది టగా. మిమ్మల్ని తీసుకుపోదామని వచ్చాడు"

ఎంత కోపం రావాలో అంతకంటె ఎక్కువే వచ్చింది. "ఎవర్రా? వేళాపాళా లేకుండా ఇంకా డిస్పెన్సరీ తెరవలేదని చెప్పు" అన్నా.

"అర్జంటుటండీ. బాగా ఎక్కువగా ఉందిట"

తప్పనిసరిగా బయటకు వచ్చాను. ఆ వచ్చిన పేషెంటు బంధువు

నా కాళ్ళా వేళ్ళా బడ్డాడు. బ్రతిమాలుకున్నాడు. ప్రార్థించాడు. విసుక్కుంటూనే తప్పనిసరిగా బయల్దేరాను.

వెళ్ళేటప్పుడు ఉషతో చెప్పాను. "రాఘవయ్య అనేవాడు ఎవ డయినా వస్తే నేను వచ్చేదాకా వుండమని చెప్పు."

నేను తిరిగి యింటికి వచ్చేసరికి ఎనిమిదన్నరయింది. గబగబ ఉషదగ్గరకు వెళ్ళి "రాఘవయ్య వచ్చాడా?" అనడిగాను.

"ఆఁ" అన్నది.

"ఏడీ?" అన్నాను ఉత్సాహంతో.

"ఇంకెక్కడుంటాడు? వెళ్ళిపోయాడు."

"అదేమిటి?"

"అదికాదండీ. వచ్చాడు. మీరున్నారా అని అడిగాడు. అంటే ఏకవచనంలోనే అడిగాడనుకోండి" అర్జంటు కేసు ఏదో చూడ టానికి వెళ్లారు. మీపేరేమిటి?" అనడిగాను. "రాఘవయ్య" అని చెప్పాడు. "అయితే వచ్చేదాకా మిమ్మల్ని కూచోమన్నారు" అని చెప్పాను. అతను ఒక అయిదు నిమిషాలుమాత్రం ఓపిక కొద్దీ కూచున్నాడు. తర్వాత లేచి, "చాలా జరూరయిన విషయం ఉందండీ. సాయంత్రం ఆరింటికి వస్తానని చెప్పండి. ఎన్నో ముఖ్యవిషయాలుకూడా మాట్లాడాలని చెప్పండి అని వెళ్ళి పోయాడు" అన్నది ఉష.

"ఈ రాఘవయ్యకు అంత తీరికలేకుండావుందా!" అనుకున్నాను. అతను మాయింటికి వచ్చినాకూడా కలుసుకోలేక పోయాననే ఉక్రోషంకూడా పుట్టుకొచ్చింది.

ఉష లోపలికి పోయింది, ఛటుక్కున ఒక విషయం గుర్తుకు వచ్చి వెనక్కి పిలిచాను.

"ఏమిటి?"

"నువ్వు అతన్ని బాగా చూశావుకదూ?" అనడిగాను.

కథా నిలయం
శ్రీకాకుళం

"ఆఁ"

"అతని గుర్తులు చెప్పగలవా?"

"బాగానే ఉంది. ఏమిటీ అర్థంలేని ప్రశ్నలు?" అంటూ విసుక్కుంది కొంచం. చెప్పక తప్పదని ప్రతిమాలుకున్నాను. ఆమెను ఎక్కువగా యిబ్బందిపెట్టడం ఎందుకని కొన్ని ప్రశ్నలు నేనే అడగదల్చుకున్నాను.

మొదట రాఘవరావును గురించిన ప్రశ్నలు వేశాను. "ఎర్రగా వున్నాడా? నల్లగా వున్నాడా?

"చామనఛాయ"

మొదట్లోనే వచ్చిపడింది చిక్కు. రాఘవరావు అప్పుడు నల్లగా ఉండేవాడు. తరువాత కనిపించినప్పుడుకూడా నల్లగానే ఉన్నాడు. ఒకవేళ రాఘవాచారి కాదుగదా! అతనయితే ఎర్రగా వుండేవాడు. బహుశా అయితే రాఘవరావుకి నలుపు విరిగయినా వుండాలి. రాఘవాచారికి ఎరుపు తగ్గి నల్లబడి వుండాలి కొద్దిగా. గడ్డం వున్నదా?"

"ఆఁ మూరెడు పొడుగు.

ఇంకో చిక్కు నాకుతెలిసిన యిద్దరిలో గడ్డం పెంచే అలవాటు ఎవరికీ లేదు. కాని గడ్డం పెరగటం ఎంతసేపు. దుర్బుద్ధి పుట్టి ఆ యిద్దరిలో ఒకడు అటువంటి పనికి తలపెట్టి వుండవచ్చు.

"పొడుగా? పొట్టా?"

"పొడుగే"

ఒకదారికి వచ్చింది సమస్య. అయితే రాఘవాచారి మాత్రం కాదన్నమాట--అతను పొట్టి.

"పొడుగ్గా సన్నగా, చువ్వలాగా వున్నాడుకదూ నీలాగ" అన్నాను ఉత్సాహంగా. అవి రాఘవరావు గుర్తులు.

"అబ్బే" అంది ఉష. "ఆజానుబాహుడు. పొడుక్కితగ్గ లావు మనిషి ఝుమాయించి ఉంటేనూ!"

హతాశుడిని అవక తప్పలేదు. రాఘవరావుకి ఒళ్ళు బలిసి లావయ్యా డనుకునేందుకు ఆస్కారంలేదు. వా డప్పటికే నానా విధమైన కసరత్తులు చేసి వళ్ళురాక బలవక డాక్టరికి చూపించుకుంటే ఆయన యీ జన్మలో యిక వళ్ళు రావటం అసాధ్యం" అన్నాడు.

కాని, ఒక్క ఆశ లేకపోలేదు. డాక్టరు చెప్పింది వేదవాక్యమని ఎందుకు భావించాలి? నా యీ కొద్ది అనుభవంలో బ్రతుకుతారని ఘంటాపథంగా చెప్పబడినవాళ్ళు పరలోకానికి ప్రయాణం చేశారు. చచ్చిపోతారని నిరాశ చేసుకున్నవాళ్ళు సజీవులై నిక్షేపంలా వున్నారు. అంటే యీరకం కేసులు ఎక్కువ సంఖ్యలో లేకపోవచ్చు—మచ్చుకి కొన్ని చాలవా? ఏదిఏమైనా నన్నింత యిరకాటంలో పెట్టిన రాఘవయ్యమీద నాకు కోపం వచ్చింది. సాయంత్రం వీలయితే వుందా మనుకున్నాను. లేకపోతే లేదనుకున్నాను. ఎందుచేతనంటే ఆ రోజు ఆదివారం. డిస్పెన్సరీ తెరవను. స్నేహితుల్తోనో, ఉషతోనో సినిమాకో, షికారుకో పోవటం అలవాటు.

సాయంత్రం ఆరున్నరదాకా ఓపికతో ఎదురు చూశాను. ఉషతో అంతకుముందే చెప్పాను. డ్రెస్ చేసుకుని వుండమని. రాఘవయ్య యీలోగా వస్తే సరేసరి. లేకపోతే ఉషతోపాటు సినిమాకి వెళ్ళిపోదామనే నిశ్చయించుకున్నాను.

రానురాను నాకోపం ద్వేషంగా కూడా మారిపోయింది. ఈ రాఘవయ్యకోసం నే నెందుకింత బాధపడాలి? అతనికోసం నాఆనందం కూడా ఎందుకు భగ్నం చేసుకోవాలి?

ఉషతో సినిమాకి బయల్దేరాను. పోయేటప్పుడు వీరిగాడ్ని పిలిచి చెప్పాను. "రాఘవయ్యవస్తే యిష్టంవుంటే వుండమని" చెప్పమని సినిమానుంచి యింటికి వచ్చేసరికి పదయింది. సినిమా చూస్తున్నంతసేపూ బాధపడుతూనే వున్నాను. కొంచంగా రాఘవయ్య

వచ్చి నిరాశ చేసుకుని వెళ్ళిపోతాడేమో, అతని మనస్సు బాధ పడుతుందేమో! అని. కాని మళ్ళీ నాకు నేనే సమాధానం చెప్పు కున్నాను—పడితే పడనియ్యమని.

"ఏరా? వచ్చాడ్రా?" అని అడిగాను గుమ్మం ఎక్కుతూనే వీరిగాడ్ని.

"వచ్చాడండి. ఇందాకట మీరటు పోగానే అరిటు వచ్చారండి. మీరేం సినిమాకి పోయారో నాకు తెల్దుగా. వచ్చేదాకా వుండ మని చెప్పినా యినుకోలేదండి. ఈ చీటీముక్కమాత్రం యిచ్చి యెళ్ళిపోయారు."

లైటువేసి చీటీ చదివాను! "ఏరా వేణుగోపాలం! నే నీ వూరు వచ్చికూడా నిన్ను కలుసుకోలేకపోయాను. నీతో చాలా మాట్లా డాలని ఆశపడ్డాను. కాని యిద్దరం కలుసుకునేందుకు వీల్లేక దాగుడుమూత లాడాం. నేను యీరాత్రి మెయిల్లోనే వెళ్ళిపో తున్నాను. తప్పలేదు. మళ్ళీ ఇప్పట్లో యిక్కడికి రాగలుగు తానని అనుకోను. వస్తే కలుసుకుంటాను. ఈసారి దాగుడుమూత లాడవద్దులే. ఉంటానురా-రాఘవయ్య"

టైము చూచుకున్నాను అప్పటికే మెయిలు వెళ్ళిపోయి గంట అయిపోయింది. కొంచం దిగులు వేసింది. రాఘవయ్యని కలు సుకోలేక పోయినందుకు.

ఏంచెయ్యను? ఇంతకంటే ఏం వ్రాయను? యిప్పటికి ఇంత కంటే ఏం తెలీదు....ఒకవేళ ఎప్పుడన్నా రాఘవయ్య వస్తే వాడెవడో గుర్తుపట్టి తప్పకుండా తెలియజేస్తాను.